క్లుప్తంగా

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని వినతి

అగనంపూడి: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును విశాఖ జిల్లా రజక సంఘం నాయకులు కోరారు. గాజువాకలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం కలిసిన నాయకులు వినతిపత్రం అందజేశారు. దేశంలోని 18 రాష్ట్రాలతో పాటు నాలుగు కేంద్రపాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని.. దాన్ని పరిగణలోకి తీసుకుని రాష్ట్రంలో కూడా రజకులను ఎస్సీజాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము, ప్రతినిధులు ఉన్నారు.

కన్నబాబుకు వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



కురసాల సత్యనారాయణ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న గాజువాక నాయకులు

గాజువాక: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబును ఆ పార్టీ గాజువాక నాయకులు సోమవారం పరామర్శించారు. పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వార్డు అధ్యక్షులు, కార్పొరేటర్లు కాకినాడలోని కన్నబాబు నివాసంలో ఆయన తండ్రి సత్యనారాయణ చిత్ర పటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, నాయకులు భూపతిరాజు శ్రీనివాసరాజు, బోగాది సన్ని, మంత్రి శంకరనారాయణ, రావాడ శివ, గొందేశి శ్రీనివాసరెడ్డి, చేగొండి శ్రీనివాస్, కోమటి శ్రీను, జీలకర్ర నాగేంద్ర, బొడ్డ గోవింద్, మెడికల్ బాబు, శ్రీనివాస పట్నాయక్, హరి తదితరులు ఉన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ స్టాలిన్

గాజువాక: జీవీఎంసీ 72వ వార్డులోని శ్రీనగర్ పార్కు, సోషల్ వెల్ఫేర్ కాలనీల్లో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. వీటిని వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలో మౌలిక సదుపాయాలతో పాటు వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు ఎ.లక్ష్మణరావు, సాలాపు రామారావు, దొడ్డి సత్యారావు, ఎం.మహాలక్ష్మినాయుడు, సత్యనారాయణమూర్తి, దాసరి విజయసాయి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్థలంలో ముళ్ల పొదల తొలగింపు



పిచ్చిమొక్కలు, పొదలు తొలగిస్తున్న పొక్లెయిన్

అగనంపూడి: అగనంపూడిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన 6. 40 ఎకరాల స్థలాన్ని చదును చేసే కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చొరవతో తలారివానిపాలెం, బొర్రమ్మపాలెం సమీపంలో అమ్మవారి వనాన్ని ఆనుకొని ఉన్న స్థలం అనువైనదిగా గుర్తించి స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిమిత్తం కేటాయింపులు చేశారు. ఆ స్థలంలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించే ప్రక్రియ ప్రారంభించినట్టు వార్డు నాయకుడు కర్రి దోంద్ర తెలిపారు.

వినాయకుడి లడ్డూ రూ.40 వేలు



పూజలు చేస్తున్న బాలాజీనగర్ పెద్దలు

కూర్మన్నపాలెం: వినాయక ఉత్సవాల్లో భాగంగా కూర్మన్నపాలెం బాలాజీనగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం విగ్రహం ముందు పెట్టిన లడ్డూను కమిటీ సభ్యులు వేలం వేశారు. కాలనీకి చెందిన రాజేష్, భరత్‌లు సంయుక్తంగా వేలం పాట పాడి లడ్డూను రూ. 40 వేలకు దక్కించుకున్నారు. అనంతరం వినాయకుడిని కాలనీలో మేళతాలలతో ఊరేగించి గంగమ్మ ఒడికి తరలించారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు త్రినాథ్, రాజు, చిన్నరమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విపియోగదారులతో కిటకిటలాడుతున్న నడుపూరు పోస్టల్ కార్యాలయం



రిజిస్టర్డ్ పోస్ట్ స్టిక్కర్



స్పీడ్ పోస్ట్ స్టిక్కర్



నడుపూరులోని పెదగంట్యాడ తపాలా కార్యాలయం

రిజిస్టర్డ్ పోస్టు ఇక చెల్లు!

అక్టోబర్ 1 నుంచి నిలిచిపోనున్న సేవలు
- స్పీడ్ పోస్టులో విలీనం
- సామాన్య, మధ్యతరగతి పై **అదనపు భారం**

పెదగంట్యాడ: రిజిస్టర్డ్‌పోస్టు **ఇక కనుమరుగుకానుంది.** శతాబ్దానికి పైగా **సేవలందించిన** రిజిస్టర్డ్‌పోస్టును ఇప్పుడు స్పీడ్ **పోస్టులో విలీనం** చేస్తున్నారు. అక్టోబర్-1 **నుంచి రిజిస్టర్డ్‌పోస్టు** సేవలు నిలిచిపోనున్నాయి. **బ్రిటిష్ కాలంలో** ప్రారంభించిన ఈ సేవలకు **ఇప్పుడు ముగింపు** పలుకుతున్నారు. మొబైల్ **ఫోన్లు, ఇంటర్నెట్** సేవలు అందుబాటులో లేని రోజుల్లో సమాచార వ్యవస్థకు ఉన్న ఒకే ఒక్క మార్గం తపాలాశాఖ. అందులో ఎన్ని సేవలున్నా.. ప్రధానమైనది రిజిస్టర్డ్‌పోస్టు.

వేగం పెంచడానికే..

అయితే వినియోగదారులకు సులభంగా.. వేగంగా సేవలు అందించేందుకు రిజిస్టర్డ్ పోస్టను స్పీడ్ పోస్టులో విలీనం చేస్తున్నట్టు తపాలాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. కొత్తగా సాఫ్ట్ వేర్‌ను అప్‌డేట్ చేసి అందులో భాగంగానే రిజిస్టర్డ్‌పోస్టు సేవలకు స్వస్తి పలికి.. స్పీడ్ పోస్టు ద్వారా స్థానికంగా అదే **రోజు, ఇతర ప్రాంతాలకు మరుసటి రోజు చేరే విధంగా చర్యలు చేపట్టారు.**

స్పీడ్ పోస్టుతో అదనపు భారం

రిజిస్టర్డ్ పోస్ట్ సేవలు రద్దు చేస్తూ స్పీడ్ పోస్టులో విలీనం చేయడంతో వినియోగదారులపై అదనపు ఆర్థిక భారం పడనుంది. ఏదైనా ప్రాంతం నుంచి సాధారణ పోస్టు ద్వారా పంపాలంటే రూ.5 స్టాంపు అంటిస్తే సరిపోయేది. అదే రిజిస్టర్డ్‌పోస్టులో అయితే రూ.17 స్టాంపు జోడించాల్సి వచ్చేది. ఈ లెక్కన రూ.22తో వారి పత్రాలు భద్రంగా అవతలి వ్యక్తులకు చేరేవి. అయితే అంతే బరువు గల కవర్ స్పీడ్ పోస్టులో పంపాలంటే రూ.45 వరకూ చెల్లించుకోక తప్పదు.

బ్రిటిష్ కాలంలో ప్రారంభం..

1854లో బ్రిటిష్ పాలకులు రిజిస్టర్డ్‌పోస్టు సేవలను **ప్రారంభించారు. సుమారు 171 సంవత్సరాల పాటు సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ రిజిస్టర్డ్‌పోస్టు ద్వారా ముఖ్యమైన పత్రాలు, వస్తువులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో కీలకపాత్ర** పోషించింది. ముఖ్యంగా లీగల్ నోటీసులు, బ్యాంకింగ్ సేవల పత్రాలు, ఆధార్ కార్డులు, ఓటరు, ఇతర గుర్తింపు కార్డులను రిజిస్టర్డ్‌పోస్టు ద్వారా పంపించేవారు. ఏటా కొత్త సంవత్సరంలో గ్రీటింగ్ కార్డును కూడా రిజిస్టర్డ్‌పోస్టు ద్వారా పంపేశారు. దీంతో ఈ సేవతో ప్రజలకు విడదీయరాని బంధం ఏర్పడింది. అయితే ఈ రిజిస్టర్డ్‌పోస్టు అవతలి వారికి అందిందో లేదో తెలియజేయడమే ప్రత్యేకత.

ప్రజలతో పాటు ప్రభుత్వ శాఖల్లో..

రిజిస్టర్డ్‌పోస్టు సేవలను ప్రజలతో పాటు ప్రభుత్వ **కార్యాలయాల్లోని వివిధ శాఖలు కూడా వినియోగించుకుంటున్నాయి. అన్ని రకాల ఉత్తర ప్రత్యుత్తరాలు పంపేవారు. అయితే రిజిస్టర్ పోస్టు సేవలను స్పీడ్ పోస్టులో విలీనం చేయడం వల్ల** పోస్టల్ చార్జీలు పెరుగుతాయని, అదనపు భారం పడనుందని వినియోగదారులు చెబుతున్నారు

పోస్టల్ సేవలను క్రమబద్ధీకరించేందుకే...

మారుతున్న కాలానికి అనుగుణంగా పోస్టల్ సేవలను కూడా ఆధునికీకరించేందుకు రిజిస్టర్డ్‌పోస్టు సేవలను స్పీడ్ పోస్టులోకి విలీనం చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. సులభంగా, వేగంగా వినియోగదారులకు సేవలు అందించడంతో పాటు స్పీడ్ పోస్టులో పంపే పత్రాలు ఆన్‌లైన్ ద్వారా ఎక్కడ ఉన్నాయో, ఎప్పుడు చేరుతాయో అన్న విషయాలను ట్రాకింగ్ ద్వారా తెలుసుకోవచ్చు.

సామాన్యులపై భారం



సామాన్య, మధ్య తరగతి ప్రజలకు రిజిస్టర్డ్‌పోస్టు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. తక్కువ ఖర్చుతో విలువైన డాక్యుమెంట్లను పంపించేవారం. రిజిస్టర్డ్‌పోస్టును రద్దు చేసి స్పీడ్ పోస్టులో కలపడం సామాన్యులకు భారమే. ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలపై భారం వేయాడాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలి.

– సీహెచ్ ఆదిత్యరామ్, చిరు ఉద్యోగి, పెదగంట్యాడ

లారీ ఢీకొని బైకిస్ట్ మృతి



మృతుడు రామకృష్ణ

కొంకోట: మండలంలోని బయ్యవరం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. సీఐ అల్లు స్వామినాయుడు వివరాల ప్రకారం.. గొలుగొండ మండలం రామనాపల్లి నుంచి గాజువాకకు వెళ్తున్న బైక్‌ను బయ్యవరం పాల డెయిరీ వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న గాజువాకకు చెందిన చలపాక రామకృష్ణ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు.

11న ఉక్కు ప్రైవేటీకరణపై బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

దాబాగార్డెన్స్: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ, సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రచారం, 11న పాత గాజువాకలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'ఈఓఐ' (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్) పేరుతో విశాఖ ఉక్కులోని 46 కీలక విభాగాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఈఓఐ రద్దుపై ప్రకటన చేయకపోవడం దారుణమని విమర్శించారు. దీనిపై ప్రజలను చైతన్యం చేసేందుకు పాదయాత్రలు, కరపత్రాల పంపిణీ, గేట్ మీటింగ్‌లు వంటి ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ పోరాటంలో ప్రజలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రమోషన్ల కోసం హెల్త్ సెక్రటరీల ఆందోళన



నిరసన చేస్తున్న హెల్త్ సెక్రటరీలు

బీచ్‌రోడ్డు: ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద హెల్త్ సెక్రటరీలు సోమవారం ఆందోళన చేపట్టారు. ప్రమోషన్లు కల్పించాలని, రీ-డిప్లాయ్‌మెంట్ రద్దు చేయాలని, జీవో ప్రకారం పనివేళలు, సెలవులు అమలు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా ప్రమోషన్ల కోసం హెల్త్ సెక్రటరీలు పలుమార్లు డీఎంహెచ్‌వోకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతోనే ఆందోళన చేపట్టాల్సి వచ్చిందన్నారు. గత 25న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు ఫిర్యాదు చేసినప్పుడు.. వారం రోజుల్లో ప్రమోషన్లు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆందోళనకు స్పందించిన డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు వారిని చర్చలకు ఆహ్వానించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఒకేషనల్ ఏఎన్ఎం ట్రైనింగ్ సర్టిఫికెట్ల జెన్యూనిటీ వెరిఫికేషన్ మూడు రోజుల్లో పూర్తి చేసి, మరో రెండు రోజుల్లో ప్రమోషన్లు ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని హామీ ఇచ్చారు. అలాగే సచివాలయం హెల్త్ సెక్రటరీలకు రీ-డిప్లాయ్‌మెంట్ నుంచి మినహాయిస్తున్నట్లు తెలిపారు. ఆయన హామీ మేరకు హెల్త్ సెక్రటరీలు ఆందోళన విరమించారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి చుక్కల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షురాలు పి. మణి, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దేవకి, రత్నం పాల్గొన్నారు.

పరిశ్రమలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

అగనంపూడి: పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి సీ ఇండియా కొలీజియేట్ క్లబ్ దోహదపడుతుందని హెచ్‌పీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఇంతియాజ్ అర్షాద్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో సీ ఇండియా కొలీజియేట్ క్లబ్ ఏర్పాటు సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఆటోమొబైల్, ఏరోస్పేస్ వంటి అంశాల్లో నూతన సాంకేతికత అందిపుచ్చుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఎన్‌ఏస్టీఎల్ హెడ్ కమాండర్ కె.టి.మిథున్ మాట్లాడుతూ ఈ క్లబ్‌ల ద్వారా సాంకేతిక పరిజ్ఞానమే కాకుండా ప్రాక్టికల్ నైపుణ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, మెకానికల్ హెచ్‌వోడీ రాంబాబు పాల్గొన్నారు.

చేమదుంపలో వినాయకుడు



వినాయకుని ఆకారంలో చేమదుంప

వినాయక ఉత్సవాల సమయంలో కూర కోసం కొనుగోలు చేసిన చేమ దుంపల్లో ఒకటి వినాయకుని ఆకారంలో కనిపించడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. గాజువాకకు చెందిన అప్పలరాజు పాతగాజువాకలోని మహిళా రైతు బజార్‌లో అరకిలో చామ దుంపలు కొనుగోలు చేశారు. అందులో ఒక దుంప పొడవాటి తొండంతో గణపతి ఆకారంలో కనిపించింది. దీంతో వారు వినాయకుడి ఆశీస్సులు తమకు ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఆ దుంపను వండకుండా దేవుడి మందిరంలో దాచుకున్నట్టు అప్పలరాజు ఈ సందర్భంగా తెలిపారు.

– గాజువాక

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాలపై అవగాహన



ప్రసంగిస్తున్న న్యాయమూర్తి పల్లవి

గాజువాక: ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం, బాల్య వివాహాలు, అకాల గర్భధారణకు వ్యతిరేకంగా మింది జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులకు సోమవారం అవగాహన కల్పించారు. గాజువాక మూడో చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయమూర్తి వి.పల్లవి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. నేరస్తులకు విధించే శిక్షలు, బాధితులకు అందించే న్యాయ సహాయం, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, అకాల గర్భధారణ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గాజువాక సీఐ ఎ.పార్థసారధి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్ పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక: గాజువాక ప్రాంతంలోని ప్రైవేట్ స్కూల్స్ ఆధ్వర్యంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించనున్న స్పోర్ట్స్ మీట్ పోస్టర్‌ను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆటలపై ఆసక్తి పెంచడం అవసరమన్నారు. నిర్వాహక సంఘం ప్రతినిధి ఎ.వాసుదేవరావు మాట్లాడుతూ వచ్చేనెల 4, 5, 11, 12, నవంబర్ 8, 9 తేదీల్లో ఈ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు క్రికెట్, ఖోఖో, చదరంగం, క్యారమ్స్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహక సంఘం ప్రతినిధులు ఎస్.వి. కె.పరశురామ్, కె.వి.సత్యానారాయణ, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి బోరు ప్రారంభం



మంచినీటి బోరును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు

గాజువాక: గాజువాక శాఖా గ్రంథాలయం ప్రాంగణంలో జీవీఎంసీ నిధులతో ఏర్పాటు వేయించిన మంచినీటి బోరును 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. గ్రంథాలయ పాఠకులకు ఈ బోరు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు బి.సూర్యకళ, వి.అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులకు పూర్తి వేతనాలు చెల్లించాలి



కేంద్ర ఉక్కు సహాయమంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు ప్రతీ నెలా నూరు శాతం జీతాలు చెల్లించాలని స్టీల్ బీఎంఎస్ నాయకులు కేంద్ర ఉక్కు సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మను కోరారు. నాయకులు భీమవరంలో మంత్రిని కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. కార్మికుల పరిస్థితిని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. వీఆర్ఎస్, రిటైర్‌మెంట్ ద్వారా ఉద్యోగుల సంఖ్య తగ్గినప్పటికీ ఉత్పత్తి లక్ష్యాలను పూర్తి చేస్తున్నారన్నారు. కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. తాత్కాలికంగా నిలిపివేసిన హెచ్‌ఆర్ఏ, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్‌లను పునరుద్ధరించాలని, నిర్వాసితులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వీఆర్ఎస్ కార్మికులు రిటైర్‌మెంట్ వరకు క్వార్టర్లలో కొనసాగేలే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.వి.ఎస్. నాయుడు, నాయకులు కొమ్మినేని శ్రీనివాస్, హరీష్ వర్మ, మండల రామస్వామి, ప్రధానకార్యదర్శి జెర్రిపోతుల రమణ, గొందేశి గురప్ప తదితరులు పాల్గొన్నారు.

మానవతా సంస్థ నూతన కార్యవర్గం నియామకం



మానవతా సంస్థ నూతన కార్యవర్గం

గాజువాక: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గాజువాక యూనిట్‌కు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రరెడ్డి సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో గాజువాక యూనిట్ అధ్యక్షుడిగా బలివాడ సత్యారావు, ఉపాధ్యక్షురాలుగా కె.రమాదేవి, కార్యదర్శిగా గంట్రేటి లక్ష్మణ్, కోశాధికారిగా దీనంకొండ పావనితో పాటు మరో ఐదుగురిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా రామచంద్రరెడ్డి మాట్లాడుతూ సమాజంలో మానవత విలువలు కాపాడడమే మానవతా సంస్థ ధ్యేయమని అన్నారు. అనంతరం క్యాన్సర్ బాధితుడు కె.రామకృష్ణ, పేద విద్యార్థి శివపార్వతికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు, ప్రతినిధులు రాధా పుష్పవతి, అవటాల రామాంజనేయరెడ్డి, సుంకర నారాయణ ప్రసాద్, అచ్యుతరావు, గోవిందరావు, రవికుమార్, జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'హిందూజా' కాలుష్యం నుంచి కాపాడాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న హిందూజా భూ నిర్వాసితులు

మహారాణిపేట: పెదగంట్యాడ మండలం పాలవలసలో ఉన్న హిందుజా సంస్థ కాలుష్యం వల్ల బాధపడుతున్న ఐదు గ్రామాల ప్రజలు సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తాము ఉంటున్న గ్రామాల నుంచి తక్షణం తరలించాలని ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు కాకి అప్పలరెడ్డి మాట్లాడుతూ హిందుజా పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల పాలవలస, దేవాడ, నక్కవానిపాలెం, గొల్లపేట, పలికిలదొడ్డి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో తరచూ అనారోగ్యాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గతంలోనూ పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎవరూ స్పందించలేదని ఆయన అన్నారు. పరిశ్రమ కాలుష్యాన్ని నియంత్రించి, తమను ఆదుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు మరోసారి వినతిపత్రాన్ని అందజేశారు.

కోక్ సైడ్ ఇన్‌చార్జి చంద్రశేఖర్‌కు అభినందనల వెల్లువ



చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న హెచ్‌ఆర్ డీజీఎం, ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్స్ కోక్ సైడ్ ఇన్‌చార్జిగా చెల్లమకూరి వెంకట రామ చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు ఆయన్ను కలిసి అభినందించారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాదరావు నేతృత్వంలో నాయకులు ప్రకాశ్, బుర్రా సుబ్బారావు, ఎస్.ఎస్. జగన్నాథం శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు కోక్ సైడ్ సమస్యలను వివరించారు. అదే విధంగా హెచ్‌ఆర్ డీజీఎం డాక్టర్ డి. రాధిక, విభాగం డీజీఎంలు బి. రమేష్‌బాబు, బి.ఎస్.ఎస్. దుర్గాప్రసాద్, ఎం. అమర్ సింగ్‌లు కలిసి అభినందనలు తెలిపారు.

ప్రపంచ బ్యాడ్మింటన్ పోటీలకు స్టీల్‌ప్లాంట్ క్రీడాకారులు



సన్యాసిరావు, లింగేశ్వరరావు, నాయక్ నాయుడు

ఉక్కునగరం: థాయిలాండ్‌లో జరగనున్న ప్రపంచ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఉద్యోగి సి.హెచ్.సన్యాసిరావుతో పాటు, మాజీ ఉద్యోగులైన బి.వి.ఎస్.కె.లింగేశ్వరరావు, కె.పి.నాయక్ నాయుడు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో థాయిలాండ్‌లోని పట్టాయలో ఈ నెల 7 నుంచి 14 వరకు ఈ పోటీలు జరుగుతాయి. ఇందులో 56 దేశాల నుంచి క్రీడాకారులు తొమ్మిది కేటగిరీల్లో పాల్గొంటారు. సి.హెచ్.సన్యాసిరావు 55+ విభాగంలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో, బి.వి.ఎస్.కె.లింగేశ్వరరావు 55+ విభాగంలో డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో, కె.పి.నాయక్ నాయుడు 60+ విభాగంలో డబుల్స్‌లో పోటీపడతారు. దేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ముగ్గురు క్రీడాకారులను ఉక్కు వర్గాలు అభినందించాయి.